
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024





మురుగు, చెత్తాచెదారంతో కనిపిస్తున్న ఏలూరు కాలువ

మురికి కూపంగా.. ఏలూరు కాలువ

- అందులో నుంచే తాగునీటి అవసరాలకు వదిలిన నీరు
- ఉమ్మడి కృష్ణాలోని తాగునీటి చెరువులకూ ఈ నీరే దిక్కు
- శుభ్రతపై అధికారుల నిర్లక్ష్యం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 10 : ఏలూరు కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం శుభ్రం చేయకుండానే బుధవారం ప్రకాశం బ్యారేజీ వద్ద 300 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో కాలువ దిగువనున్న గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని తాగునీటి చెరువులకు ఈ నీరే దిక్కు. కావడంతో వాటిని అపరిశుభ్రంగా ఉన్న ఈ నీటిని తాగడానికి జనం జంకుతున్నారు.

ఏలూరు కాలువ కింద కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి చెరువులున్నాయి. మూడు జిల్లాల్లోని అరు మండలాల్లో 60 గ్రామాలకు తాగునీరు, దాదాపు లక్ష ఎకరాలకుపైగా సాగు నీరందించే ఏలూరు కాల్వ నిర్వహణ దశాబ్దాలుగా అధ్వానంగా మారింది. దిగువ గ్రామాల ప్రజలు కాలువ గుట్టు మీద పోసిన చెత్తంతా కాలువలోకి జారు తోంది. చెత్తా చెదారంతోపాటు విషతుల్యమైన జంతు అవశేషాలు కూడా కాలువలో కలుస్తున్నాయి. వీటిని పట్టించుకునే నాధుడు లేదు. దీంతో ఏలూరు కాలువ దశాబ్దాలుగా మురికి కూపంలా మారిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి సాగునీరు విడుదల చేసినపుడు గుర్రపుడెక్క పెరిగి ఆ తరువాత నీటి సరఫరా నిలిపివేయగానే గుర్రపుడెక్క ఎండిపోయి చెత్తగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. గతేడాది నవంబరులో కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్నవారు లేరు. పొలాల్లో పనికి వెళ్లిన కూలీలంతా పంట బోదెల్లో ప్రవహించే ఆ నీటినే తాగేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దుర్గాంధాలతో కూడిన నీటిని చెరువుల్లో నింపి వాటినే గ్రామాల్లో రక్షిత ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేయడంతో ఆ నీటిని తాగిన ప్రజలతోపాటు పశువులు కూడా జీర్ణకోశ, చర్మ వ్యాధుల బారిన పడే ప్రమాదముంది.

60 గ్రామాల్లో 86 చెరువులకు ఈ నీరే ప్రధానం

సాగు, తాగు అవసరాలు తీర్చడంలో ఏలూరు కాలువకు ఎంతో ప్రాధాన్యత ఉంది. గతంలో రెండు జిల్లాలకు పరిమితమైన ఈ కాలువ జిల్లాల పునర్విభజనతో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు విస్తరించింది. ఈ జిల్లాల పరిధిలో విజయవాడ నుంచి ఏలూరు వరకు 65 కి.మీ పొడవున ఈ కాలువ సాగుతోంది. దీని కింద 60 గ్రామాల్లో 86 చెరువులు ఉన్నాయి. 1.15 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 1,650 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉన్న ఈ కాలువ నీటిని దాదాపు లక్షన్నర మంది వివిధ అవసరాలకు వాడుతుంటారు. వేసవిలో 15 రోజులు పాటు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తుంటారు. కనీసం వేసవిలోతాగు నీటి అవసరాలకు విడుదల చేసినపుడైన శుభ్రం చేసి మంచినీటిని ప్రజలకు అందించాలని కోరుతున్నారు.

అడుసు తొక్కనేల.. కాలు కడగనేల అన్నట్టుంది బందరు పోలీసుల పరిస్థితి. ఈ ఐదేళ్లు స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు చెప్పుచేతల్లో నడుచుకుని, వారి అడుగులకు మడుగులొత్తిన పోలీసులు తాజాగా జరిగిన పరిణామాలతో తలలు పట్టుకుంటున్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలోనే బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించడం, సీసీ కెమెరా, ఫర్నీచర్ ధ్వంసం చేయడం లాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో వైసీపీ నాయకులపై చిలకలపూడి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అయితే ఎమ్మెల్యే, ఆయన కుమారుడిపై మాత్రం కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.



నాడు తలూపి.. నేడు తల బాదుకొని...



మంగళవారం పోలీస్‌స్టేషన్ ముట్టడిలో పేర్ని నాని

పోలీసుల ఉదాసీన వైఖరిపై సర్వత్రా చర్చ

మచిలీపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అధికారులు గతంలో పేర్ని కిట్టు చెప్పిన పనులన్నీ డూడూ బసవన్నాల్లా తలూపి చేసిన అలుసుతోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు తాలూకా పోలీస్‌స్టేషన్‌పై దాడికి తెగబడటానికి కారణమైందని నియోజకవర్గం మొత్తం చర్చ జరుగుతోంది. ఇంత జరిగినా పోలీసులు ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడిపై కేసు నమోదుచేయకుండా తప్పించే ప్రయత్నం వెనుక కొందరు పోలీస్ ఉన్నతాధికారుల హస్తం ఉందనే వాదన వినపడుతోంది.

- పోలీస్‌స్టేషన్‌పై దాడి ఘటనలో ముగ్గురు వైసీపీ నాయకులపై కేసు
- తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ఫర్నీచర్ ధ్వంసం చేశారని ఫిర్యాదు
- దాడి ఘటనలో పేర్ని నాని, కిట్టులపై కేసు నమోదు చేయకుండా దాటవేత ధోరణి
- పేర్ని నాని తీరుపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకుల ఫిర్యాదు

● అసలేం జరిగిందంటే..

బందరు మండలం ఉల్లిపాలెంలో ఈనెల 7న జాతర జరిగింది. ఈ జాతరలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఇరువర్గాల వారు గాయాలపాలయ్యారు. ఇరు వర్గాలను తాలూకా ఎస్ఐ చాణక్య స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే వైసీపీ కార్యకర్తలపై ఎస్ఐ దాడి చేశాడనే కారణంతో మంగళవారం మచిలీపట్నం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు, ఎమ్మెల్యే పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు 200 మందికిపైగా తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హైడ్రామా సృష్టించారు. వైసీపీ కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, మీర్ అస్గర్ అలీ, వైసీపీ నాయకుడు జవ్వాది రాంబాబు తాలూకా పోలీస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్ సెంట్రీ కానిస్టేబుల్ హరికృష్ణ చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా 144 సెక్షన్‌ను అతిక్రమించినందుకు 188 సెక్షన్‌ను, ఉద్దేశపూర్వకంగా పోలీస్‌స్టేషన్ వద్ద గలాటా సృష్టించినందుకుగాను 143 సెక్షన్‌ను, సీసీ ఫుటేజీ, కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసినందుకుగాను 427 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు, వైసీపీ నాయకుడొకరిపై కేసు నమోదు చేశారు.

● పేర్ని నాని, కిట్టులపై కేసు నమోదు చేయాలి

బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌పై ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టు వారి అనుచరులతో దాడిచేసి, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన ఘటనలో ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు వైసీపీ మచిలీపట్నం నియోజకవర్గం అభ్యర్థి పేర్ని కిట్టుపై పోలీసులు కేసు నమోదు చేయాలని మచిలీపట్నం టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. బందరు మండలం ఆర్-గొల్లపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ తన స్వార్థ ప్రయోజనాల కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులను ఇంతకాలంగా పేర్ని నాని పెట్టించి ఇబ్బందుల పాలు చేశాడన్నారు. ఇప్పటివరకు పేర్ని నానికి అడుగులకు మడుగులొత్తిన పోలీసులు ఆయన చెప్పిన ప్రతిపనినీ చేశారని అన్నారు. పోలీసులు ఇప్పటికైనా గ్రహించాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు.

● ఎన్నికల సంఘం సీఈవోకు ఫిర్యాదు

మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని, మచిలీపట్నం వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు ఎన్నికల సంఘం సీఈవో ఎంకే మీనాకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టు అనుచరులు, వైసీపీ కార్యకర్తలు బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌పై ఎమ్మెల్యే ఆయన అనుచరుల దాడి ఘటనపై వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం సీఈవో టీడీపీ నాయకులకు హామీ ఇచ్చారు.

పేర్ని కిట్టు చెప్పినట్టు చేసి...

నాలుగేళ్లుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే కుమారుడు కిట్టు మచిలీపట్నంలోని పోలీస్‌స్టేషన్లపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఎలాంటి అధికారమూ లేకున్నా తన తండ్రి పేరును ఉపయోగించుకుని పోలీస్ అధికారులను సైతం తన గుప్పెట్లో పెట్టుకుని ఆటాడుకున్నారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు కిట్టు చేసిన సిఫార్సులన్నింటికీ తలూపి ఇంతకాలం వారు చెప్పిందల్లా చేశారు.

- ఇనుగుదురుపేట పోలీస్‌స్టేషన్ సీఐ ఒక కార్పొరేటర్ చెప్పినమాట వినలేదనే కారణంతో ఆయనతో బలవంతంగా సెలవు పెట్టించి అనంతరం బదిలీ చేయించారు.
- చిలకలపూడిలో ఇంటి స్థలం వివాదంలో కాంగ్రెస్ నాయకులపై అకారణంగా కేసులు కూడా పెట్టించారు.
- బందరుకోటలో భూమి వివాదానికి సంబంధించిన కేసులో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నాయకులు దాడిచేశారు. బాధితుడు నెలరోజులు విజయవాడ ఆసుపత్రిలో ఉండి కోలుకున్న తరువాత మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే పోలీసులు పట్టించుకోనేలేదు.

వేసవికి ప్రత్యేక రైళ్లు

- సికింద్రాబాద్-కొల్లం మధ్య..

- 6లో..

తల్లీకూతుళ్లకు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన నెట్టెం, తదితరులు

- 6లో..

నూతన డీపీవో నియామకం

బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్ యాదవ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా కొత్త పంచాయతీ అధికారి (డీపీవో)గా ఎన్వీ శివప్రసాద్ యాదవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అధికార పార్టీకి భజన చేస్తున్న ప్రస్తుత డీపీవో టీఎస్ జయచంద్ర గాంధీని జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు విధుల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఆయన్ను విస్సన్నపేట డ్వామా ఏపీడీగా రివర్షన్ ఇచ్చారు. ఈ క్రమంలో నూతన డీపీవోగా నందిగామ డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న శివప్రసాద్‌కు కలెక్టర్ పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా పంచాయతీ అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివప్రసాద్ ఆదేశాలిచ్చారు.

అక్రమ క్వారీయింగ్ నిలిపివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కొండపావులూరులోని సర్వే నెంబర్ 34లో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్‌ను అక్రమార్కులు నిలిపివేశారు. సాగర్ కాల్వకు గండికొట్టి మరీ మట్టిని తోడేస్తున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావటంతో అక్రమార్కులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో గుట్టుగా సాగిస్తున్న బండారం వెలుగు చూసేసరికి నిర్వాహకులు అర్ధంతరంగా తవ్వకాలను నిలిపివేశారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ శాఖలు స్పందించకపోవటం గమనార్హం. కనీసం అక్రమ క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతాలను కూడా పరిశీలించలేదు. స్థానిక వీఆర్వోకు ఈ అక్రమ క్వారీయింగ్ వ్యవహారాలు తెలిసినా పట్టించుకోకపోవటం గమనార్హం. స్థానికులు.. మండల ఆర్ఐకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఈ విషయాన్ని స్థానికులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకురావటంతో గుట్టురట్టయింది. కాగా, అక్రమార్కులు తాత్కాలికంగానే క్వారీయింగ్‌ను నిలుపుదల చేశారు. తమైనింగ్ , రెవెన్యూ శాఖలు స్పందించి అక్కడే ఉన్న ఎక్స్‌కవేటర్లను సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



హై పవర్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెరిగిన విద్యుత్ వాడకం

- 2023 మార్చిలో మొత్తం డిమాండ్ 533.801 మెగావాట్లు
- ఈ ఏడాది 598.533 మెగావాట్లకు పెరుగుదల
- డిమాండ్‌లో 12 శాతం పెంపు


మున్ముందు మరింత పెరిగే చాన్స్

ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉష్ణోగ్రతలు టాప్ లేపేస్తున్నాయి. మార్చి రెండో వారం నుంచే అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ప్రభావం విద్యుత్ వినియోగంపై పడుతోంది. సాధారణంగా ఏప్రిల్ రెండోవారం నుంచి విద్యుత్ వాడకం పెరుగుతుంది. డిమాండ్ అప్పటినుంచే పెరుగుతూ ఉంటుంది. అటువంటిది ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు మార్చి నుంచి నమోదు కావడంతో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈ ఏడాది మార్చిలో అత్యధికంగా 598.533 మెగావాట్ల విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడింది. గడిచిన ఏడాది మార్చిలో ఈ డిమాండ్ 533.801 మెగావాట్లుగా ఉంది. దీన్నిబట్టి చూస్తే ఈ ఏడాది 12 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఇప్పుడే డిమాండ్ ఈస్థాయిలో ఉంటే మున్ముందు మరింత పెరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చిలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు 628.340 మెగావాట్ల విద్యుత్‌ను కేటాయించారు. ఇందులో 598.533 మెగావాట్ల విద్యుత్‌ను ఉమ్మడి జిల్లావాసులు వినియోగించారు.

ఆ ఎనిమిది గంటలే అధికం

జిల్లావాసులు నిత్యం ఎనిమిది గంటల పాటు విద్యుత్‌ను బాగా ఉపయోగిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫ్యాన్లు, ఏసీలు విరామం లేకుండా ఆన్ చేసి ఉంచుతున్నారు. ఉదయం 10 గంటలకే ఉష్ణోగ్రతలు తీవ్రరూపాన్ని చూపిస్తున్నాయి. మధ్యాహ్నానికి ఉక్కపోతలు దారుణంగా ఉంటున్నాయి. దీంతో ప్రజలు చల్లదనం కోసం ఫ్యాన్లు, ఏసీలు ఉపయోగిస్తున్నారు. ఇక రాత్రి సమయాల్లో 10 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్‌ను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్ రెండో వారంలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు మార్చిలోనే నమోదు కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.



ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈనెలలో వాడకం

గతంలో డిమాండ్ తేదీ	మెగావాట్లు
31-05-2018	855.40
27-05-2019	1,003.50
23-05-2020	930.70
29-05-2021	1,024.60
09-06-2022	1,187.10
11-06-2023	1,254.40

2019 నుంచి పెరుగుదల


జిల్లాలో 2019 నుంచి విద్యుత్ వినియోగం, డిమాండ్ పెరిగింది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2000-2001 సంవత్సరం నుంచి 2023-2024 సంవత్సరం వరకు అత్యధికంగా విద్యుత్ డిమాండ్ ఉన్న నెలలకు సంబంధించిన రికార్డును అధికారులు రూపొందించారు. 2000-2001 విద్యుత్ సంవత్సరంలో 251.26 మెగావాట్ల డిమాండ్ ఉండేది. ఆ సంవత్సరంలో ఏప్రిల్ 28న ఈ డిమాండ్ ఏర్పడింది. 2019-20 విద్యుత్ సంవత్సరంలో డిమాండ్ 1,000 మెగావాట్లను దాటింది. 2019, మే 27వ తేదీన ఉమ్మడి జిల్లాలో 1,003.50 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. 2020-21 విద్యుత్ సంవత్సరంలో ఈ డిమాండ్ కొంతమేర తగ్గింది. ఆ తర్వాత ఏడాది నుంచి డిమాండ్‌లో పెరుగుదల కనిపించింది. 2022-23 సంవత్సరంలో 1,187.10 మెగావాట్ల డిమాండ్ వచ్చింది. 2023-24 సంవత్సరంలో ఇది 1,254.40 మెగావాట్లకు పెరిగింది. గడిచిన ఏడాది జూన్ 11వ తేదీన ఈ డిమాండ్ వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు మార్చి 30వ తేదీన అత్యధిక డిమాండ్ ఏర్పడింది. ఆరోజు 1,061.10 మెగావాట్ల విద్యుత్‌ను ఉమ్మడి జిల్లాలో వినియోగించారు.

అంతకుమించి..

ఓటరు కార్డుల్లో తప్పులు అనేకం

- అడ్రస్‌లు, పుట్టిన తేదీలే అధికం
- వందేళ్లు దాటినట్టుగా చూపిస్తున్న డేటా
- లబోదిబోమంటున్న ఓటర్లు
- బీఎల్వోల నిర్వాకం కారణంగానే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓటర్ కార్డులు తప్పులతడకగా మారాయి. పేర్లు, పుట్టిన తేదీలు పెద్ద సంఖ్యలో తప్పుగా నమోదవుతున్నాయి. సవరణకు దరఖాస్తు చేసుకున్నా సరిదిద్దట్లేదు. దీంతో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్వో) నిర్వాకం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. స్పెషల్ సమ్మరీ రివిజ్ (ఎస్ఎస్ఆర్) జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా తప్పుల సవరణకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. పేర్లు, అడ్రసులు, పుట్టిన తేదీలు వంటివి మారిపోతున్నాయి. కొత్తగా వచ్చిన ఓటర్లకు సంబంధించి కూడా ఇలాగే జరుగుతున్నాయి. దీనిని బట్టి బీఎల్వోలు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారో అర్థమవుతుంది. సామాన్య ఓటర్లే కాకుండా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల ఓట్ల విషయంలోనూ ఇదే జరుగుతోంది. కొత్తగా ముద్రించిన కార్డులు సహా పాత ఓటర్ల కార్డుల పరిస్థితీ ఇదే.



కృష్ణమోహన్ జననం 1970 కాగా 1900 అని ముద్రించిన అధికారులు

అడ్రస్‌లు, పుట్టిన తేదీల్లో తప్పులు

ప్రధానంగా ఓటర్ల కార్డుల్లో అడ్రస్‌లు, పుట్టిన తేదీల్లో తప్పులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్, తూర్పు, గన్నవరం, మైలవరం నియోజకవర్గాల పరిధిలో పెద్ద సంఖ్యలో తప్పులు జరిగాయని తెలుస్తోంది. ఆధార్ ప్రాతిపదికన పుట్టిన తేదీ సరిపోల్చుకునే అవకాశమున్నా ఆ పని చేయలేదు. ఇక 1900, జనవరి 1వ తేదీతో ఎక్కువగా ఓటరు కార్డులు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో శతాధిక వృద్ధులు 140 మంది వరకు ఉన్నారు. వీరుకాకుండా 50, 60 ఏళ్ల ఉన్నవారికి కూడా శతాధిక వయస్సు దాటినట్టుగా చూపారు. రామవరప్పాడు గ్రామానికి చెందిన కడియం కృష్ణమోహన్, ఆయన సతీమణి కల్యాణి ఓటరు కార్డులపై పుట్టిన తేదీ 1900, జనవరి 1 అని ముద్రించారు. వాస్తవానికి కృష్ణమోహన్ పుట్టిన తేదీ 1970, జూన్ 14. కల్యాణి పుట్టిన తేదీ 1982, ఫిబ్రవరి 6 కాగా, 1900, జనవరి 1 అని నమోదు చేశారు. వీరు రామవరప్పాడులోని శుభం కల్యాణ మండపం వెనుక అమ్మాజీ టవర్స్‌లో ఉంటుండగా, డోర్ నెంబర్ 6-156/4 పేర్కొంటూ పట్టెల వారి వీధిలో నివసిస్తున్నట్టుగా నమోదు చేశారు. ఈ తప్పులు ఇబ్బందికరమైనవే. ఎందుకంటే పాస్‌పోర్టుల జారీలో ఓటరు కార్డులను కూడా చూస్తారు. తప్పుల కారణంగా పాస్‌పోర్టు జారీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.



గులాబీలు, కనకాంబరాలతో కనకదుర్గమ్మకు అర్చన

పుష్పమాలా శోభితం..

» దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో పూజ

వన్‌టౌన్, ఏప్రిల్ 10 : చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో తొమ్మిది రోజుల పాటు జరిగే విశేష పుష్ప పూజలో భాగంగా బుధవారం అమ్మవారిని కనకాంబరాలు, గులాబీలతో అర్చించారు. లలితా సహస్ర నామ పారాయణ అనుసంధానంతో విశేషంగా పుష్పాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అమ్మవారి పుష్పసేవలో పాల్గొన్నారు. తొలుత పుష్పాల బుట్టలను అర్చకులు, ఉద్యోగులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రాలతో వేదిక వద్దకు తీసుకువచ్చారు. అమ్మవారి షోడసోపచారాలు నిర్వహించిన అనంతరం పుష్పాలతో అర్చించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి శాంతినగర్‌కు చెందిన కొత్తమాసు వంశీధర్ కుటుంబసభ్యులు బుధవారం ఆలయానికి విచ్చేసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబసభ్యులకు దుర్గమ్మ దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

ఇబ్రహీంపట్నం సంగమం వద్ద పంచహారతుల పునరుద్ధరణకు చర్యలు


ఇబ్రహీంపట్నం కృష్ణా-గోదావరి సంగమ ప్రాంతంలో కృష్ణవేణికి పంచహారతుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవంగా కృష్ణవేణీ నదీమ తల్లికి దుర్గాఘాట్ వద్ద 2008లో పంచహారతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరక్రమంలో 2016 పుష్కరాల సమయంలో భారీ సెట్టింగులతో పంచహారతులు నిర్వహించారు. ఈక్రమంలో కొన్ని అనివార్య కారణాల వల్ల అక్కడ పంచహారతుల కార్యక్రమాన్ని రద్దు చేశారు. దుర్గాఘాట్‌లో కూడా అంతంత మాత్రంగానే హారతుల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా సంగమ ప్రాంతం వద్ద తిరిగి పంచ హారతులు ప్రారంభించేందుకు సంకల్పించిన నేపథ్యంలో బుధవారం సంగమం వద్ద పరిస్థితిని ఈవో రామారావు సూచనల మేరకు అధికారులు అధ్యయనం చేశారు.

దుర్గగుడి షాపులకు కరెంట్ కట్

» అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో ఈవో చర్యలు

వన్‌టౌన్,ఏప్రిల్ 10: దుర్గగుడిలో నడుస్తున్న షాపుల అద్దెల బకాయిలు చెల్లించకపోవడంతో బుధవారం వాటికి కరెంట్ కట్ చేశారు. ఈవో రామరావు ఆదేశాల మేరకు ఈ మేరకు ఏఈవోలు చర్యలు తీసుకున్నారు. అద్దె బకాయిలు చెల్లిస్తేనే కరెంట్‌ను పునరుద్ధరిస్తామని ఈవో తెలిపారు. ఏఈవో వెంకటరెడ్డి గత కొన్ని రోజులుగా అద్దె బకాయిలను చెల్లించాలని కోరుతున్నారు. మూడు పర్యాయాలు నోటీసులు జారీ చేశారు. షాపుల వారి వద్ద నుంచి అద్దె బకాయిలు భారీ మొత్తంలో పేరుకుపోయాయని, షాపుల వారు ఖాతరు చేయడంలేదని ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. దీనపై స్పందనంగా ఆలయ ఈవో ఆదేశాల మేరకు షాపుల వారికి హెచ్చరికలు జారీ చేశారు. కనకదుర్గ నగర్‌లో 21 షాపులు, మహామండపం ఐదవ అంతస్తులో మూడు షాపులకుగాను మొత్తం రెండు కోట్ల రూపాయలకు పైగా అద్దె బకాయిలున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. 10 లక్షల విరాళం



పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులు దివంగత కేతినేని వెంకటరత్నం, శేషమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కేతినేని రత్నకరరావు లక్ష్మీశమంత కమణి దంపతులు రూ.10,00,000 చెక్కును విరాళంగా ఈవో కె.రమేష్ నాయుడుకు బుధవారం అందజేశారు. - **పెనుగంచిప్రోలు**



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ దిల్లీరావు

పోలింగ్ ప్రక్రియలో పీవోల పాత్ర కీలకం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 10 : పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. వారికి మెరుగైన శిక్షణ అందించాలని ఆర్వో, ఏఆర్వో, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆర్వో, ఏఆర్వో, ఏఎల్‌టీకు అయన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బందికి ఈనెల 13, 14వ తేదీల్లో పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో ఏఎల్టీలు, పీవోలు, ఏపీవోల్లో ఆత్మస్థైర్యం నింపేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి అంశంపైనా ఓ క్రమ పద్ధతిలో ప్రాక్టికల్ అప్రోచ్‌తో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది? వాటిని ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీ పి.సంపత్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌కు హైదరాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఫ్లైట్ ప్యాకేజ్

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 10 : భారతీయ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ సంస్థ (ఐఆర్‌సీటీసీ) హైదరాబాద్ బ్రాంచ్ నుంచి ల్యాండ్ ఆఫ్ స్మైల్స్ థాయ్‌లాండ్‌కు టూర్ ప్యాకేజ్‌ను నిర్వహిస్తోంది. మార్గ మధ్యలో ఉన్న బుద్ధిస్టు దేవాలయాలు, వన్యప్రాణి శ్రేణి, ద్వీపాలు తదితర ఎన్నో థాయ్‌ల్యాండ్ సొంతమని ఈ ప్రాంతంలో పర్యటించడం ఒక దివ్యానుభూతి అందిస్తుందని విజయవాడలోని ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన మే 9వ తేదీన హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు మే 12వ తేదీన బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు ఫ్లైట్ సర్వీస్ ఉందని తెలిపారు. సింగిల్ షేరింగ్ రూ.57,415 డబుల్, ట్రిబుల్ షేరింగ్ రూ.49,040 చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9281495848 , 8977314121 నెంబర్‌లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

రాష్ట్రానికి రాజధాని ఉంటేనే 'ఆర్‌బీఐ' కార్యాలయం

వన్‌టౌన్, ఏప్రిల్ 10 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే ఏపీకి రాజధాని ఏదన్నది ప్రభుత్వమే నిర్ణయించాలని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ సుమేడ్ జావడే పేర్కొన్నారని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని జాస్తి వీరాంజనేయులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గతంలో లేఖ రాశారు. వివరాలు పంపాలని ఆర్‌బీఐకు లేఖ అందింది. బుధవారం ఆర్‌బీఐ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు భారతదేశ పటంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని కేంద్రం ఎప్పుడో ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా పార్లమెంట్‌లో రాజధాని అమరావతి అని సమాధానమిచ్చిందన్నారు. ఈ విషయం ఆర్‌బీఐకు తెలియకపోవడం విచారకరమన్నారు. చంద్రబాబు అమరావతిలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 11 ఎకరాల భూమిని కేటాయించి జీవో కూడా ఇచ్చారని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నరేంద్ర మోదీ, పురందేశ్వరిలు, ఇతర ప్రతిపక్ష నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చి రాజధాని అమరావతిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆర్‌బీఐకు చెందిన పనులు ప్రారంభించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

» వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10 : వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఎంపీ, ఉమ్మడి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ధ్వజమెత్తారు. బుధవారం బందరు రూరల్ మండలం ఎస్.గొల్లపాలెం, రుద్రవరం, గుండుపాలెంలలో వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు ఇంటింటికీ పర్యటించారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. పంచాయతీల సర్పంచ్‌లకు నిధులు లేక కనీస అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోతున్నారన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడా రోడ్ల నిర్మాణాలు జరగలేదన్నారు. టీడీపీ హయాంలో



రుద్రవరంలో ఎడ్లబండిపై అభ్యర్థుల ప్రచారం

ప్రారంభించిన రోడ్ల పనులు వైసీపీ పాలకులు పూర్తి చేయలేదన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాల్లో నీరు లేక ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని, కిట్టుపై కేసులు నమోదు చేయాలి : రవీంద్ర డిమాండ్

స్టేషన్‌కు వెళ్లి పోలీసులపైనే దౌర్జన్యం చేసిన ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టులపై కేసు నమోదు చేయాలని కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. ఆర్.గొల్లపాలెంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు రోజుకు పేర్ని నాని, పేర్ని కిట్టుల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. మచిలీపట్నంలో 144 సెక్షన్ ఉన్నప్పటికీ వందలాది నాయకులు, కార్యకర్తలతో స్టేషన్‌పై దోమ్మీగా పేర్ని నాని వెళ్లడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఓడిపోతామనే భయంతోనే పేర్ని నాని భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, బ్యానర్లు చించారని జనసేన కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా దాడిచేసి స్టేషన్ ముందు పడేశారని, తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు చెప్పేందుకు జనసేన, టీడీపీ కార్యకర్తలు భయపడుతున్నారన్నారు.

పోలవరంపై జగన్ నిర్లక్ష్యం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బాలశౌరి, కుమార్ రాజా, బుద్ధప్రసాద్

కూచిపూడి, ఏప్రిల్ 10 : చంద్రబాబు హయాంలో 72శాతం పనులు పూర్తయిన పోలవరం ప్రాజెక్టుపై ఆ తర్వాత అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో అలసత్వం వహించారని మచిలీపట్నం కూటమి బలపర్చిన జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి విమర్శించారు. రైతులపై ఈ ముఖ్యమంత్రికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. కాజ గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో బాలశౌరి మాట్లాడుతూ, పోలవరం పూర్తి కాకపోతే డెల్టా ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి ఎంతమాత్రం లేకపోగా.. ఇసుకతోపాటు సహజ వనరుల దోపిడీ జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గ్రామంలో రహదారుల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా యువకులు పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేనలోకి చేరటంతో పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. టీడీపీ పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, ఎంపీగా బాలశౌరిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదిస్తే గ్రామాల రూపు రేఖలు మారుస్తామని తెలిపారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించగా.. నేతలను అభిమానులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నేతలు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), నన్నపనేని వీరేంద్ర, తాడిశెట్టి నరేష్, లింగమనేని రామలింగేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు..

కోడూరు : కోడూరు మండల వైసీపీకి భారీ షాక్ తగిలింది. బుధవారం మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో మాచవరం గ్రామ సర్పంచ్ అప్పికట్ల లక్ష్మి, కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పూతబోయిన కరుణకుమార్, ఉల్లిపాలెం నాయకులు సిద్ధినేని వెంకట భారతరావు, అనుచరులు జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. గతంలో మండల వైసీపీలో కీలక పాత్ర పోషించిన దివంగత నేత పూతబోయిన చిన్న వెంకటేశ్వరరావు కుమారుడు పూతబోయిన కరుణకుమార్‌కు పార్టీలో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. అదేవిధంగా మాచవరం గ్రామపంచాయతీకి ఏ విధమైన నిధులు కేటాయించకపోవటంతో కేవలం సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన వైసీపీ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సర్పంచ్ లక్ష్మి వైసీపీని వీడారు. వీరితో పాటు పలువురు వైసీపీని వీడి జనసేనలో చేరారు.

నాడు కాంగ్రెస్ నేతలు.. నేడు జనసేన అభ్యర్థులు!

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 10 : ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పిన ఇద్దరూ ప్రస్తుతం జనసేన పార్టీ నేతలుగా ఉన్నారు. 1999, 2004 ఎన్నికల్లో మండలి బుద్ధప్రసాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2004లో ఆయన పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న వల్లభనేని బాలశౌరి తెనాలి ఎంపీగా విజయం సాధించారు. తర్వాత నరసారావుపేట నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం వీరిద్దరు ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. బందరు పార్లమెంట్ జనసేన పార్టీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి, జనసేన పార్టీ అవనిగడ్డ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్‌లు ఉన్నారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన సంకల్ప ర్యాలీతో ప్రజలు నాయకులతో మమేకం కాగా, నేతలు సైతం పరస్పరం భారీ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూటమి ప్రచారం

» మూడు పార్టీల జెండాలతో కార్యకర్తల అడుగులు

నందిగామ, ఏప్రిల్ 9 : జెండాలు ఏకమయ్యాయి. అజెండాలు కలిశాయి. లక్ష్యం వైపు అడుగులు వేస్తూ కూటమి పార్టీలు ఓట్లు కూడగట్టుకొనే పనిలో నిమగ్నమయ్యాయి. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ఏర్పడిన తరువాత ఓట్ షేర్ ఎలా జరుగుతుందా అన్న ఆలోచన ప్రజల్లో ఉంది. ఆ ఆలోచనలకు సమాధానం చెపుతూ నందిగామలో మూడు పార్టీలు ఏకోన్ముఖంగా ముందుకు సాగుతున్నాయి. కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య ఎన్నికల ప్రచారంలో బీజేపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. పార్టీల ఆదేశాల మేరకు సౌమ్య



కలిసిన కూటమి జెండాలు

విజయానికి కృషి చేస్తున్నారు. సౌమ్య వారికి సముచిత స్థానం కల్పిస్తూ అనుసరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవి, జనసైనికులు, వీరమహిళలు సౌమ్యకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. మూడు జెండాల అజెండా ఒకటే అన్న సంకేతంగా ఒకే కర్రకు మూడు జెండాల చొప్పున ఏర్పాటు చేశారు. మూడు పార్టీల కార్యకర్తల భుజాలపై మూడు జెండాలు ఉండేలా చర్యలు చేపట్టారు. మరోవైపు రెండు రోజులకో మారు పార్టీల ముఖ్య నేతలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఎన్నికల వ్యూహాలపై చర్చలు జరపుకుంటున్నారు. నందిగామలో కూటమి ఐక్యంగా ముందుకు సాగుతూ మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

వ్యవసాయరంగం నిర్వీర్యం

» వైసీపీ ప్రభుత్వ తీరుపై వసంత ఫైర్

జి.కొండూరు, ఏప్రిల్ 10 : వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, చింతలపూడి పూర్తిచేసి ఉంటే ఈప్రాంత ఎన్ఎస్‌పీ కాలువల్లో గోదావరి నీరు ప్రవహించేదని, మైలవరంతో పాటు మరో ఏడు నియోజకవర్గాల్లో రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిపోయేవని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు గ్రామాల్లో బుధవారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.



తెల్లదేవరపాడులో మాట్లాడుతున్న వసంత

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సుమారు రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చుచేసి చాలా వరకు పనులు పూర్తిచేస్తే వైసీపీ ప్రభుత్వంలో పథకాన్ని పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అయినా విలువ లేదన్నారు. ఆశించిన స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయానన్నారు. జగన్ నాయకత్వంలో పనిచేయలేక వైసీపీని వీడినట్టు చెప్పారు. రహదారి అభివృద్ధికి కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. కూటమి అధికారం చేపడితే తప్పకుండా రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటాయన్నారు. పేదలకు సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా చంద్రబాబు నాయుడికి మాత్రమే ఉందన్నారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు బొలియశెట్టి శ్రీకాంత్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సమాచారం ఇచ్చిపుచ్చుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల సమయంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా సంఘటనలు జరిగితే వెంటనే ఎన్నికలసంఘానికి తెలియజేసి, ఎన్నికలసంఘం సూచనలు, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరించవద్దన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్‌అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే అక్కడకు చేరుకుని పరిస్థితిని సాధ్యమైనంత త్వరగా అదుపులోకి తేవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించే వారిపై పోలీస్ అధికారులు ముందస్తుగానే నిఘా పెంచి తగుచర్యలు తీసుకోవాలన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను ఒకేచోట ఉంచారని, వాటిని వేర్వేరుగా భద్రపరచాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలు త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల సామర్థ్యం రెండు నెలలపాటు ఉండేలా సాంకేతికంగా సరిచేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నామినేషన్ల దరఖాస్తులు వస్తాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల అందజేత, ఈవీఎంలకు వినియోగించే విధానంపై సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలన్నారు. మండలస్థాయిలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలవిధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటుహక్కు వినియోగించుకునేలా అన్నిఏర్పాట్లు చేయాలని సూచించారు. దివ్యాంగులు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ట్రైసైకిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలను, స్లిప్పులను ముద్రించేందుకు ప్రింటర్లను ఎంపిక చేయాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, పెడన, పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు డీఎస్పీలు సమావేశంలో పాల్గొన్నారు.



వేసవికి ప్రత్యేక రైళ్లు

» సికింద్రాబాద్-కొల్లం మధ్య..

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 10 : వేసవి రద్దీని తట్టుకునేందుకు సికింద్రాబాద్-కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీటీఆర్‌వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. 07193 సికింద్రాబాద్-కొల్లం రైలు బుధవారం సాయంత్రం 6.40కు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి గురువారం 11.55కు కొల్లం చేరుతుంది. ఈ రైలు ఈ నెల 17, 24 తేదీల్లో మే 1, 8, 15, 22, 29 తేదీల్లో జూన్ 5, 12, 19, 26 తేదీల్లో నడుస్తుంది. కొల్లం-సికింద్రాబాద్ రైలు కొల్లంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి శనివారం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీలలో నడుస్తుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడీ, జోలార్‌పేట జంక్షన్, సేలం జంక్షన్, ఈ రోడ్ జంక్షన్, తిరూప్పూరు, కోయంబత్తూరు జంక్షన్, పాల్గాట్, త్రిసూల్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనసిరి, తిరువల, చెంగనూర్, మావిలిక్కర, కాయన్‌కులం జంక్షన్‌లలో ఆగుతుంది. ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, ఏసీ టూ టైర్, ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

» హైదరాబాద్-కటక్ మధ్య..

హైదరబాద్-కటక్ మధ్య కూడా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. హైదరాబాద్-కటక్ రైలు ప్రతి మంగళవారం నడుస్తాయని ఈ నెల 16, 23, 30వ తేదీలలోను.. కటక్-హైదరాబాద్ రైలు ప్రతి బుధవారం.. ఈ నెల 17, 24, మే1వ తేదీలలో నడుస్తాయి. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్ స్టేషన్‌లలో ఆగుతుంది.

» పుణ్యక్షేత్ర యాత్రకు రైల్వే ప్యాకేజీ

భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రెయిన్‌లో పుణ్యక్షేత్ర యాత్ర కింద పూరీ, కాశీ, అయోధ్య ప్రత్యేక యాత్ర ప్యాకేజీని నిర్వహిస్తున్నట్టు విజయవాడ ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగలకు ప్రత్యేక రైలు నడుపుతున్నారు. వివరాలకు 9281495848(ప్రవీణ్), 8977314121 (రాజేష్)లను సంప్రతించవచ్చు.

వాహన తనిఖీల్లో రూ.3.10లక్షల స్వాధీనం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 10 : స్థానిక ఏలూరు రోడ్డులో బొమ్ములూరు ఎలక్షన్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో బుధవారం ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.3.10లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఏడీఎల్ జనార్దన్ తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఓ వ్యక్తి కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ1.35లక్షలు, విజయవాడకు చెందిన మరో ఇద్దరు ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్న రూ1.75లక్షలు నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌లో ఐదుగురిపై వేటు

» పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారని ఆరేళ్లపాటు బహిష్కరణ

» జిల్లా అధ్యక్షుడు వి.సంజీవరెడ్డి వెల్లడి



విజయవాడ/మచిలీపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) టౌన్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ పదవులను ప్రకటించిన తరువాత పార్టీని అప్రతిష్ట పాలు చేస్తున్న ఐదుగురు నేతలపై ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు వి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన మహమ్మద్ దాదాసాహెబ్, ఊటుకూరి శాంతిరాజు, కోన నాగార్జున, పెడనకి చెందిన కేదారేశ్వరరావు, గన్నవరానికి చెందిన షేక్ జాన్ బాషాలు టికెట్ దొరక్క అక్కసు, ఈర్ష్యతో జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వాన్ని కించపరుస్తూ దుర్భాషలాడుతున్నారన్నారు. అసభ్యకరమైన పదజాలంతో పత్రికలు, ప్రచార మాధ్యమాల ద్వారా పార్టీని, నాయకులను అవమానపరిచి క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించారన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘించిన వీరిని పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్టు సంజీవరెడ్డి తెలిపారు.

జనసేన ఈఎంసీ నియామకం

విజయవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కమిటీని జనసేన నియమించింది. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ఏడుగురికి స్థానం కల్పించారు. ఈ కమిటీకి బండి రామకృష్ణ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. సభ్యులుగా అక్కల రామ్మోహనరావు, పంచకర్ల సందీప్, బోనీ పార్వతి, చిలకలపూడి పాపారావు, బాడిత శంకర్, అజయ్‌వర్మ ఠాకూర్ ఉంటారు. వారిలో పంచకర్ల సందీప్‌ను మచిలీపట్నం కమిటీతోపాటు కాకినాడ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు.



నివాళులర్పిస్తున్న నెట్టెం రఘురామ్

తల్లీకూతుళ్లకు కన్నీటి వీడ్కోలు

» నివాళులర్పించిన నెట్టెం, తదితరులు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 10 : కొణకంచి గ్రామంలో తల్లీ కూతుళ్లు కమతం గీతాంజలి, హానికల పార్థివ దేహాలకు బుధవారం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. గత నెల 31న అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో తల్లీకూతుళ్లు మృతి చెందగా తండ్రి, కుమారుడు నరేష్ - భ్రమణ్‌లు గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. గీతాంజలి, హానికల పార్థివదేహాలను మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఏఐసీసీ సభ్యుడు రేసాల మోహనరావు, వెనిగళ్ల సురేష్‌తోపాటు పలు గ్రామాలకు చెందిన ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. గీతాంజలి పుట్టిల్లు, అత్తగారిల్లు కావటంతో కొణకంచి గ్రామానికి చెందిన మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి

గన్నవరం, ఏప్రిల్ 10 : టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ గ్రామ అధ్యక్ష కార్యదర్శి పాలడుగు మల్లికార్జునరావు, మేడేపల్లి కాంతారావు అన్నారు. ముస్తాబాదలో సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తూ కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని బుధవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ సంతోషంగా ఉండాలంటే చంద్రబాబు నాయుడు సీఎం కావాలన్నారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, గూడపాటి రవికుమార్, కె.వీరభద్రరావు, బండారు కాంతారావు, కూరేటి వాసు, కలపర్తి అనిల్, పి.శేఖర్‌బాబు, శాంతకుమారి, నాగమణి, కోనేరు రమామణి, కార్తిక్, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనం రూ.600 ఇవ్వాలి



బుద్దవరంలో కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నేత ఆర్.రఘు

గన్నవరం, ఏప్రిల్ 10 : ఉపాధి కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బుద్ధవరం పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను బుధవారం సీపీఎం బృందం కలసి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో మంచి నీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, షామియానా కూడా ఏర్పాటు చేయటం లేదన్నారు. రోజు రూ.200 కూడా కూలీ రావటం లేదని సీపీఎం నాయకులకు కూలీలు వివరించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు చూపించాలని, వేసవిలో వంద రోజులు పని చూపించి రోజుకు కనీసం రూ.500 తగ్గకుండా వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కూలీలంతా సంఘటితంగా ఉండి ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీపీఎం ఎప్పుడు అండగా నిలుస్తుందన్నారు. నాయకులు బడుగు మరియదాసు, మిరప నాగేశ్వరరావు, నక్కా రామారావు తదితరులు పాల్గొన్నారు.

20 మంది వలంటీర్ల రాజీనామా

గన్నవరం, ఏప్రిల్ 10 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 20మంది వలంటీర్‌లు బుధవారం రాజీనామా చేశారు. పలువురు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, మరికొందరు గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే



కానూరులో జరిగిన శంఖారావంలో యార్లగడ్డ సుచిత్ర తదితరులు

పెనమలూరు, ఏప్రిల్ 10 : ఐదేళ్లుగా సంక్షోభంలో ఉన్న రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్ది అభివృద్ధి బాటలో పెట్టగల ఏకైక సమర్థుడు చంద్రబాబు మాత్రమేనని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పేర్కొన్నారు. బుధవారం కానూరులో జరిగిన శంఖారావం పాదయాత్ర సందర్భంగా స్థానికులతో ఆమె మాట్లాడారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను వివరించి సదరు పథకాలతో ఒక్కో ఇంటికి చేకూరే లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును తిరిగి ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట వల్లభనేని శరత్, నరసింహరావు పాల్గొన్నారు.

సైకో విధానాలతో విసుగెత్తిపోయారు

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 10 : సైకో జగన్‌రెడ్డి విధానాల పట్ల విసుగెత్తిపోయిన రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ వైపు చూస్తున్నారని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం యనమలకుదురులో వైసీపీ నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్‌రెడ్డి అరాచక పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక దోపిడీతో సామాన్యుడికి ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కూలీలు ఆకలితో అలమటించాల్సిన రోజులు దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ వర్గానికీ న్యాయం చేయలేని జగన్ రాష్ట్రానికి అవసరమా అని ప్రశ్నించారు. పార్టీలోకి కుటుంబాలతో సహా వచ్చిన పదుల సంఖ్యలో వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వెలగపూడి బాబూరావు, అయోధ్య సత్యనారాయణ, అనంతనేని ఆజాద్, శొంఠి శివరాంప్రసాద్, నిడుముక్కల శ్రీనివాసరావు, అనుమోలు ప్రభాకరరావు, ఆకునూరు సుబ్బారావు, కాకాని సత్యనారాయణ, శంకరరావు, పేరి సోము నాగేశ్వరరావు, యలవర్తి ప్రసాద్, చాగంటిపాటి నారాయణ, మున్నంగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమాకలో..

మారేడుమాక (కంకిపాడు) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని మారేడుమాకలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయాలన్నారు. ఎక్కడ నుంచో వచ్చిన వైసీపీ అభ్యర్థి జోగి రమేష్ ఎక్కడ ఉంటాడో, ఎప్పుడు వస్తాడో కూడా తెలియదన్నారు. పోరంకి పార్టీ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, అన్నే ధనయ్య, గొంది శివరామకృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, సెంగెపు రంగారావు, ఊసల రామయ్య, వీరబాబు, యార్లగడ్డ రాజా పెనమలూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోసపోవద్దు

గండిగుంట(ఉయ్యూరు): వైసీపీ నాయకుల మోసపూరిత మాటలునమ్మి మరోచాన్స్ ఇస్తే నియోజకవర్గం, రాష్ట్రం అధోగతి పాలవుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. గండిగుంటలో బుధవారం కూటమి నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. పెనమలూరు ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుంటున్నారని నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెడన నియోజకవర్గంలో అవినీతికి పాల్పడి అందిన కాడికి దోచుకున్న ఆయనను పెనమలూరును సర్వనాశనం చేయమని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారా అని ప్రశ్నించారు. పార్టీ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, నాదెళ్ల యుగంధర్ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, కొండా ప్రవీణ్, దండమూడి చౌదరి, రాంబాబు, సంగెపు రంగా రావు, జనసేన నాయకులు ముప్పా రాజా, చినకోటయ్య, కార్తికేయ, ఆదినారాయణ పాల్గొన్నారు.



మానికొండలో ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ సతీష్



పెరికీడులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు

యార్లగడ్డ సోదరుడు సతీష్



రామవరప్పాడు ఏలూరు కాల్వకట్టపై ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి

ఉంగుటూరు, ఏప్రిల్ 10 : సంపద సృష్టించడం ద్వారా పతనమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించి స్వర్ణాంధ్రగా చేయగల సత్తా, సమర్థత చంద్రబాబు నాయుడుకే వుందని, ఆయన్ని తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత ప్రజలపై వుందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ అన్నారు. బుధవారం తన సతీమణి లక్ష్మితో కలిసి మానికొండలో గడపగడపకు ప్రజాగళం పేరుతో ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్య, కార్యదర్శి గుడ్డేటి సుమతి, గుజ్జర్లపూడి బాబూరావు, నూతక్కి బెనర్జీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎడ్లపల్లి సాయి, ఉపాధ్యక్షుడు బెజవాడ నాగేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి ఆరికట్ల రవి, దాసరి రవళి, షేక్ అజీజ్, నయాం బాషా, అయినపూడి భువనేష్, ప్రకాష్, పార్వతీశ్వరరావు, రవిచందర్, వరికూటి కిషోర్, దాదా తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు లబ్ధి

టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరటంతోపాటు సమన్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం లో భాగంగా మంగళవారం రాత్రి మండలంలోని వేంపాడులో విస్తృతంగా పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా గన్నవరంలో పోటీచేస్తున్న యార్లగడ్డ వెంకట్రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొలుసు రవీంద్ర, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు కాల్వపై వంతెన నిర్మిస్తాం

గుణదల : ఏలూరు కాల్వపై డబుల్‌లైన్ వంతెన నిర్మాణం చేసి స్థానికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నిర్ణయించుకున్నారని యార్లగడ్డ జ్ఞానేశ్వరి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి బుధవారం రామవరప్పాడు ఏలూరు కాల్వకట్టపై ప్రచారం చేసి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏలూరు కాల్వపై వంతెన నిర్మాణం గ్రామంలో రైతు బజార్ ఏర్పాటుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. రామ వరప్పాడు గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు యార్లగడ్డ రూపకల్పన చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నబిగాని కొండ, అద్దేపల్లి సాంబశివనాగరాజు, కొల్లా ఆనంద్ కుమార్, తుపాకుల శివలీల, కొంగన రవి, అడ్డగిరి రామకృష్ణ, పి.పుణ్యవతి, టి.రాజేశ్వరి, కాట్రగడ్డ రాంబాబు రేగళ్ల రాజా, పలసాని మోహనరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతోనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వహణ కార్యదర్శి వేగిరెడ్డి పాపారావు, జనసేన వీర మహిళ బండారు ప్రసన్న అన్నారు. పెరికీడు టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇంటింటికీ శంఖారావం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరే విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ రూపొందించిన పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థులైన యార్లగడ్డ వెంకట్రావుకు, బాలశౌరికి మద్దతుగా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజులపాటి శ్రీనివాసరావు, ఆరేపల్లి సుబ్బారావు, గొట్టాపు ప్రవీణ్, పోతన సురేష్, జనసేన నాయకులు బండారు ప్రసన్న, సింగవరపు దుర్గారావు, దావులూరి సాంబశివరావు పాల్గొన్నారు.



యార్లగడ్డకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆళ్ల

టీడీపీతోనే గ్రామీణాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 10 : గన్నవరం నియోజకవర్గం సర్వతో ముఖాభివృద్ధి జరగాలంటే టీడీపీ కూటమితోనే సాధ్యమని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం టీడీపీ నాయ కులు యార్లగడ్డ వెంకట్రావును బుధవారం వారి స్వగృహంలో కలిసి అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి శేషవస్త్రాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు వెనిగళ్ల జ్ఞానశేఖర్, అర్జున్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్



ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న బోడె వెంకట్రామ్

ప్రొద్దుటూరు (కంకిపాడు) : రాష్ట్ర సంక్షేమం కోసం మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ప్రొద్దుటూరులో బుధవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పావనమూర్తి, వై. ఫణి, కోటేశ్వరరావు, టి. సతీష్, స్టాలిన్, శ్రీనివాసరావు, అడపా మహేష్, సీహెచ్ రవితేజ, వి. రఘు, టి. రాజేశ్వరి, సీహెచ్ అభి తదితరులు పాల్గొన్నారు. ● కంకిపాడులో నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్ పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా టీడీపీ

రంజాన్ తోఫా పంపిణీలో వెలగపూడి, షేక్ బుజ్జి



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న శంకరబాబు, బుజ్జి

పెనమలూరు, ఏప్రిల్ 10 : రాష్ట్రంలోని నిరుపేద ముస్లింలకు టీడీపీ అన్నివేళలా అండగా ఉంటుందని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి పేర్కొన్నారు. బుధవారం పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేసి మాట్లాడారు. ముస్లింలకు సైకో జగన్ రద్దు చేసిన పథకాలన్నింటినీ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామన్నారు. రంజాన్ తోఫా, విదేశీ విద్య, దుల్హన్ పథకం కింద లక్ష ఇచ్చే పథకం లాంటివన్నింటినీ తిరిగి అమలు చేస్తామని పేర్కొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

ఉంగుటూరు, ఏప్రిల్ 10 : గంజాయి కేసులో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఆత్కూరు ఎస్సై పైడిబాబు తన బృందంతో కలిసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం, తేనె జిల్లా, ఉత్తం పోలయం మండలం, కంబం గ్రామానికి చెందిన పిన్నత వెర్ రవిశేఖర్(39), 2020లో పట్టుబడిన గంజాయి కేసులో నిందితుడుగా ఉన్నాడు. ఏడాది క్రితం నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కావటంలేదు. దీంతో విజయవాడ ఎంఎస్‌జే కోర్టు మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేంది. ఆత్కూరు ఎస్సై, తన సిబ్బందితో కలిసి మధురైలో ఉన్న అతడిని అరెస్టు చేశారు. బుధవారం విజయవాడ ఎంఎస్‌జే కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

మేనిఫెస్టోలో బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యమివ్వండి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో బలహీనవర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమివ్వాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు కోరారు. బుధవారం విజయవాడలో లోకేశ్‌ను బోసుబాబు కలిశారు. వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్లను తగ్గించారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. టీడీపీ హయాంలో సబ్సిడీలపై బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చేవారని వైసీపీ పాలనలో వాటిని ఎత్తివేశారని అన్నారు. బీసీ కార్పొరేషన్లు వైసీపీ పాలనలో నామమాత్రమయ్యాయన్నారు. తన తండ్రి బచ్చుల అర్జునుడు బాటలో పయనిస్తున్నానని, జిల్లాలో మచిలీపట్నంతో పాటు గన్నవరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్టు లోకేశ్‌కు ఆయన వివరించారు.



నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న బచ్చుల బోసుబాబు

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత: కలెక్టర్ డీకే బాలాజీ



గుడివాడ మార్కెట్‌యార్డులో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

గుడివాడ/పామర్రు, ఏప్రిల్ 10: స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ, కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం గుడివా, పామర్రు మార్కెట్ యార్డులలో నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి పటిష్ఠమైన భద్రత కల్పించినట్లు ఆయన తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సీసీ ఫుటేజ్‌ను భద్రపరచాలని సూచించారు. గదుల వెంటిలేషన్ బాగుండాలని, కిటికీలు, డోర్లు పటిష్ఠంగా ఉండాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా సిబ్బందికి మెటీరియల్ పంపిణీ కోసం ఏర్పాటు చేసే రిసెప్షన్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. గుడివాడలో రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి, డీఎస్పీ పి.శ్రీకాంత్, తహసీల్దార్లు పాల్గొన్నారు. పామర్రులో ఆర్వో బి.శ్రీదేవి, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, సీఐ శుభకర్, ఎస్సై పి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సర్వేయర్ పర్వీన్ సుల్తానా, ఎన్నికల డీటీ పి.జగన్మోహనరావు పాల్గొన్నారు.

సిద్ధం సభకు బస్సులు.. ప్రయాణికులకు అవస్థలు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 10: సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి 20 బస్సులు సత్తెనపల్లికి వెళ్లటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు రాకపోవడంతో ఆటోల్లోనే ప్రయాణించి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. సిద్ధం సభలు ఎప్పుడు ముగుస్తాయో, తమ ప్రయాణ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని దివిసీమ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

కక్షిదారులకు కనీస వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, పక్కన జిల్లా న్యాయాధికారి అరుణసారిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10: "జిల్లా కోర్టు ఆవరణలో కక్షిదారులకు కనీస వసతులు కల్పించాలి. 135 ఏళ్ల చరిత్ర కలిగిన మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు సరైన ఆదాయపు వనరులు లేక ఆశించినంతగా అభివృద్ధి లేదు. మహిళా న్యాయవాదులకు డార్మిటరీ, విశ్రాంతి భవనం లేక ఇబ్బంది పడుతున్నారు. కక్షిదారులకు సరైన మరుగుదొడ్లు లేవు. వృద్ధుల విశ్రాంతి భవనం లేదు" అని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ సమావేశపు హాలులో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బూరగడ్డ అశోక్‌కుమార్, జనరల్ సెక్రటరీ సిద్ధినేని శ్రీసత్యసాయిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. మౌలిక వసతులు పెంపొందించేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయాధికారి అరుణసారిక అన్నారు. పలువురు జిల్లా జడ్జిలు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బోదెలు శుభ్రం చేయించండి..

ఊర చెరువుల్లో నీరు నింపండి

- ఎంపీడీవోకు అర్తమూరు గ్రామస్థుల వినతి

బంటుమిల్లి, ఏప్రిల్ 10: గ్రామంలోని ఊర చెరువులకు నీరు సరఫరా చేసే బోదెల్లో తూడు, జమ్మి, చెత్తను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, బోదెలు శుభ్రం చేయించి, ఊర చెరువుల్లో నీరు నింపాలని ఎంపీడీవో రామకృష్ణరాజుకు అర్తమూరు గ్రామస్థులు అర్జీ ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఫణికుమారికి ఊర చెరువులకు నీరు సరఫరా అయ్యే బోదెలు బాగు చేయించాలని పలుమార్లు విన్నవించుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అర్జీలో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం పంచాయతీ చెరువులకు నీరు పెట్టేందుకు అనుమతులు ఇచ్చినా పంచాయతీ కార్యదర్శి స్పందించలేదని తెలిపారు. ఊర చెరువులకు నీరు పెట్టడం వల్ల పశువులకు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఇతర అవసరాలకు ఎంతో దోహదపడతాయని చెప్పినప్పటికీ బోదెలు బాగు చేయడంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయితీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతులు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఎం, ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడానని వెంటనే సమస్య పరిష్కరిస్తానని ఎంపీడీవో రామకృష్ణరాజు హామీ ఇచ్చారు.

డోకిపర్రులో తాగునీటి సమస్య పరిష్కరించాలి

- గ్రామస్థుల డిమాండ్

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 10: కొన్ని రోజులుగా డోకిపర్రులో తాగునీటిని పంచాయతీ సిబ్బంది సక్రమంగా సరఫరా చేయడం లేదని, సమస్యను తక్షణమే పరిష్కరించాలని బుధవారం గ్రామస్థులు పలువురు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి రమేష్ బాబును కోరారు. బ్రహ్మరెడ్డి చెరువు నింపామని అక్కడ నుంచి నీరు పంచాయతీ చెరువుకు తోడుతున్నామని కార్యదర్శి చెప్పగా ఎన్నిరోజులు ఈ సమాధానం చెబుతారని ఎక్కడ నీరు తోడుతున్నారో చూపించాలని గ్రామస్థులు కార్యదర్శిని ప్రశ్నించారు. గ్రామంలోని పలు సమస్యలను కార్యదర్శి దృష్టికి తెచ్చారు. సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

గ్రామంలోని తాగునీటి సమస్యపై పలువురు గ్రామస్థులు బుధవారం కలెక్టర్ డీకే బాలాజీని కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.







ఆర్.గొల్లపాలెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర, మునిపెడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాగిత కృష్ణప్రసాద్, తోట్లవల్లూరు శివారు కలాస్‌మాలపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వర్ల విశ్రమ, గురుమూర్తి, శివరామ్

కూటమి ప్రభుత్వమొచ్చాక..

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

కొల్లు రవీంద్ర హామీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10: "టీడీపీ ప్రభుత్వంలో ఎన్నికల ముందు లబ్ధిదారులకు లాటరీ వేసి టిడ్కో ఇళ్లు ఇచ్చాం. కోడ్ రావడంతో గృహప్రవేశాలు కాలేదు. వైసీపీ ప్రభుత్వమొచ్చాక వైసీపీ పాలకులు కొందరు టీడీపీ హయాంలో ఇచ్చిన లబ్ధిదారుల పేర్లను మార్చి వైసీపీ కార్యకర్తలకు ధారాదత్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాస్తవాలను నిగ్గుతేల్చి లబ్ధిదారులకు న్యాయం చేస్తాం."అని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. బుధవారం ఆర్.గొల్లపాలెంలో కొల్లు రవీంద్ర ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. "వైసీపీ ఐదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఆర్థికంగా ఇబ్బంది పడ్డాం. రానున్న ఎన్నికల్లో కొల్లు రవీంద్ర వెంటే ఉంటాం." అని ఆర్.గొల్లపాలెంలో పలువురు గ్రామస్థులు అన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్, లంకే హరికృష్ణ, తూమాటి బసవయ్య పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం: కాగిత

కృత్తివెన్ను: జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని టీడీపీ-జనసేన-బీజేపీ పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం మునిపెడలో కాగిత ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని వ్యవస్థల్ని సర్వనాశనం చేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. వచ్చే కూటమి ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి, ఉద్యోగులకు అండగా ఉంటుందని వివరించారు. వలంటీర్లకు జీతం రూ.10 వేలు, వృద్ధులకు ఫించను రూ.4 వేలు ఇస్తామని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగిత సతీమణి ప్రచారం

బంటుమిల్లి: కాగిత కృష్ణప్రసాద్‌ను గెలిపించాలంటూ అర్తమూరులో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి కృష్ణప్రసాద్ సతీమణి కాగిత శిరీష బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కోరారు. కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, భూపతి రమేష్, కాగిత బాలాజీ, జరీనా, దాసరి కరుణజ్యోతి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితుల అభ్యున్నతి: వర్ల విశ్రమ

తోట్లవల్లూరు: చంద్రబాబు సీఎం అయితేనే దళితులకు మేలు కలుగుతుందని వర్ల విశ్రమ అన్నారు. తోట్లవల్లూరు శివారు కలాస్ మాలపల్లి(అంబేడ్కర్ నగర్)లో బుధవారం తన భర్త, టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా గెలుపు కోరుతూ ఆమె ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. దళితుల కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్ రద్దు చేశారన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, నాయకులు లుక్కా రేణుకారావు, గొరిపర్తి గోపయ్య, నెక్కలపూడి మురళీ, తెలుగు నాని, వల్లూరు రాంబాబు పాల్గొన్నారు.

కుమార్‌రాజాను ఆశీర్వదించండి

పామర్రు: నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పామర్రు అభ్యర్థిగా పోటీచేస్తున్న వర్ల కుమార్ రాజాను ప్రజలు ఆశీర్వదించాలని టీడీపీ మండల ఎన్నికల ప్రచార కమిటీ అబ్జర్వర్ జైపాల్ కోరారు. చాట్లవానిపురంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, పరస సుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు, వల్లూరిపల్లి గణేష్, అర్జున్, జైరాజు, అంజి, చాట్ల రమేష్ చింతయ్య వీరంకి మోహన్, వెంకటేశ్వరరావు, సందీప్ పాల్గొన్నారు.

టిడ్కో రుణాలు మాఫీ చేయాలి



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ

గుడివాడ: టిడ్కో గృహాలపై రూ.650కోట్లు రుణాలున్నాయని, వాటిని మాఫీ చేయాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఏవో సత్యనారాయణకు కమిటీ వినతిపత్రం అందించింది. కమిటీ అధ్యక్షురాలు సంగమ్మ, కార్యదర్శి అరుణ మాట్లాడారు. టిడ్కో కాలనీలో ప్రతి బ్లాక్‌కు బోరు ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. కాలనీలో పాఠశాలలు, అంగన్వాడీలు, సచివాల యాలు, పోలీస్‌స్టేషన్, రేషన్‌షాపులు, ఆస్పత్రి, పార్కులు, కల్యాణ మండపాలు, ఎన్నికల సందర్భంగా ప్రత్యేక బూత్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులను చెల్లించే కౌంటర్లు ఏర్పాటు చేయా లని, 50మంది మున్సిపల్ సిబ్బందిని అదనంగా నియమించాలని వారు డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు ఎం.దుర్గ, వి.దుర్గ, గౌస్, బాబురావు, బాలాజీ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం

చల్లపల్లి కమిటీ నియామకం

చల్లపల్లి, ఏప్రిల్ 10: ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(384/2022) చల్లపల్లి మండల నూతన కమిటీ నియామకం జిల్లా అధ్యక్షుడు జి.గోపీచంద్ అధ్యక్షతన బుధవారం చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో జరిగింది. సంఘం మండల అధ్యక్షుడుగా వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా పి.సతీష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.దివ్యసాయి, ఉపాధ్యక్షునిగా జి.నరేష్, కోశాధికారిగా ఎం.సాంబశివరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.వినోద్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఉదయభాస్కర్, బి.లక్ష్మి, కార్యనిర్వాహక సభ్యులుగా పి.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, బి.రాజ్యలక్ష్మి, టి.కార్తీక్, సీహెచ్ సుజిని, బి.తేజలక్ష్మి, కె.రవి అంకినీడు ప్రసాద్‌తోపాటు 13 మంది సభ్యులతో మండల కమిటీని నియమించారు. వీరికి జిల్లా అధ్యక్షుడు జి.గోపీచంద్ నియామక పత్రాలను అందజేశారు. సంఘ నేతలు కె.కిరణ్ కుమార్, వి.లావణ్య, మోహనకృష్ణ, నవీన్, శ్రవణ్‌కుమార్, విష్ణు, భవాని శంకర్, రేవంత్, మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అలీనఖీపాలెం మసీదులో ఈద్ ఉల్ ఫితర్ కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

అలీనఖీపాలెంలో ఈద్ ఉల్ ఫితర్

పమిడిముక్కల, ఏప్రిల్ 10: అలీనఖీపాలెం మసీదుజీ హుస్సేన్‌లో బుధవారం ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదులో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొని ఒకరికొకరు ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

పాత వారినే పారిశుధ్య

కార్మికులుగా కొనసాగించాలి

- ఎండీవోకు భట్లపెనుమర్రు ఉప సర్పంచ్ వినతి

కూచిపూడి, ఏప్రిల్ 10: పదిహేడేళ్లుగా భట్లపెనుమర్రులో పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న బంగారు సాంబశివరావు, యశోద దంపతులను కొనసాగించాలని ఉప సర్పంచ్ చలసాని వెంకటరత్నంతోపాటు మరో ఏడుగురు పాలకమండలి సభ్యులు ఎండీవో జి.చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ మట్టా ఇందిర వారి పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని, పారిశుధ్య కార్మికులగా సాంబశివరావు-యశోద దంపతులనే కొనసాగించాలని పది మంది పాలక మండలి సభ్యులు తీర్మానం చేసినప్పటికీ పంచాయతీ కార్యదర్శి నేటి వరకు తీర్మాన పుస్తకంలో పొందుపర్చలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాలకమండలి సభ్యుల అభిప్రాయాలకు విలువ లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్న సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రంలో కోరారు. దీనిపై ఎండీవో చంద్రశేఖర్‌రావును వివరణ కోరగా, గ్రామ పాలకమండలి సభ్యులు ఇచ్చి ఫిర్యాదుపై ఈవోపీఆర్డీ సీతారామరాజుతో విచారణ చేయించి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి (డీపీవో)కు అందిస్తామని తెలిపారు.

వైసీపీ నుంచి జనసేనలోకి..



బోట్లవానిపాలెంలో వైసీపీ కార్యకర్తలను జనసేనలో చేర్చుకుంటున్న బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10: బందరు మండలం తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బోట్లవానిపాలెంలో బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సమక్షంలో వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. బోట్ల నాగార్జునబాబు, బోట్ల వాసుదేవ, బోట్ల సందీప్, బోట్ల అశోక్, బోట్ల రామకృష్ణ, బొమ్మిడి దేవస్వామి, పెద్ది కామేష్ తదితరులు పార్టీలో చేరారు. జనసేన మండల నాయకులు శ్రీపతి వాకాలరావు, పీతల నాగేశ్వరరావు, పెద్దిరాజు, మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మహమ్మద్ సమీర్, కర్రి మహేష్, ఈమన మణిబాబు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందీ ప్రభుత్వం

- వైసీపీని చిత్తుగా ఓడించండి
- రైతులకు తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు పిలుపు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10: వ్యవసాయాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, వైసీపీ పాలకులను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని రైతులకు తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. టీడీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించలేదన్నారు. రైతులు అప్పుల పాలయ్యారన్నారు. టీడీపీ హయాంలో రైతులకు సబ్సిడీపై ఎరువులు, ట్రాక్టర్లు, విత్తనాలు ఇచ్చారన్నారు. రైతు భరోసా కింద రూ.12500 ఇస్తానని జగన్‌రెడ్డి ఎన్నికల్లో రైతులను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక రూ.7500 మాత్రమే ఇచ్చి మాట తప్పారన్నారు. టీడీపీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణి కుమార్, తెలుగురైతు నాయకులు పామర్తి లక్ష్మణ్, వేముల శివాజీ, ఆళ్ల మాధవ, బడే రమణ, వాటపల్లి రాము పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



పెనమలూరులో బోడె ప్రసాద్‌ను సత్కరిస్తున్న టీడీపీ పెడన నాయకులు

పెడన, ఏప్రిల్ 10: టీడీపీ-జనసేన-బీజేపీ పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్‌ను టీడీపీ పెడన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, అగస్తేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ బళ్ల ప్రసాద్, జయలక్ష్మి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చందన నారాయణరావు, చేనేత ప్రముఖుడు బొడ్డు దీక్షానందుడు బుధవారం పెనమలూరులోని బోడె ప్రసాద్ స్వగృహంలో కలిసి సత్కరించారు. ప్రసాద్ ఘన విజయం సాధిస్తారని ఈ సందర్భంగా వేణుగోపాలరావు పేర్కొన్నారు.

పంపుల చెరువును పూర్తిగా నింపుతాం

- మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు

గుడివాడ: కాలువల ద్వారా విడుదల చేసిన నీటితో పంపుల చెరువును పూర్తిగా నింపుతామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. బుధవారం పెద ఎరుకపాడులోని హెడ్ వాటర్‌వర్క్స్‌ను మున్సిపల్ ఇంజినీరు బి.విజయదుర్గతో కలిసి ఆయన పరిశీలించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. నీటిని నింపే ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ డీఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

పెడన, ఏప్రిల్ 10: అనారోగ్యం కారణంగా చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో జరిగింది. 3వ వార్డు పడమట వీధికి చెందిన చేనేత కార్మికుడు ఈద్దం చంద్ర శేఖర్(35) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయాడు. చంద్రశేఖర్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. భార్య ధనలక్ష్మి చుట్టుపక్కల వారి సహకారంతో చంద్రశేఖర్‌ను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడి వైద్యుల సలహా మేరకు అతనిని బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రి నుంచి సమాచారంతో ఎస్సై సూర్య శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు వేస్తున్న పదిమంది అరెస్టు

పెడన, ఏప్రిల్ 10: బల్లిపర్రు గ్రామ శివారులో కోడి పందేలు వేస్తున్న పది మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై సూర్య శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రాత్రి సిబ్బందితో దాడి చేశామని, పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ. 3040 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

వరికుప్ప దగ్ధం

పెడన రూరల్: చెన్నూరు శివారు గొల్లగూడెంలో నందూరి తుకారానికి చెందిన మూడున్నర ఎకరాల వరికుప్ప దగ్ధమైందని వీఆర్వో భారతి తెలిపారు. సమీపంలోని పొలాల్లో వరిగడ్డిని రైతులు దహనం చేస్తుండగా గాలికి వరికుప్పకు నిప్పు అంటుకుని కాలి పోయిందని వివరించారు. పంట నష్టం వివరాలను భారతి నమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు

పెడన, ఏప్రిల్ 10: పెడన పోలీసు స్టేషన్‌లో బుధవారం బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. మచిలీపట్నం గొడుగుపేటకు చెందిన బాలిక ఇంట్లో అలిగి ఈనెల 8న బంటుమిల్లిలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అదే రోజు అమ్మమ్మ మనుమరాలును వెంట పెట్టుకుని ఆటోలో మచిలీపట్నం బయలుదేరింది. మార్గ మధ్యంలో పెడనలో బాలిక ఆటో దిగేసి అదృశ్యమైపోయింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగానమ్మ

వైభవంగా గంగానమ్మ జాతర

కోడూరు, ఏప్రిల్ 10: గంగానమ్మ జాతర బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మూరు శ్రీనివాస శర్మ అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో సీఐ త్రినాథ్, ఎస్ఐ పి.శిరీష ఆధ్వర్యంలో 80 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కూటమి మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, కూటమి అవనిగడ్డ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, వైసీపీ అవనిగడ్డ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ యుగంధర్ నాయకులను సత్కరించారు.

కొండాలమ్మ ఆలయ రికార్డుల తనిఖీ

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 10: వేమవరం కొండాలమ్మ ఆలయంలో దేవదాయ కమిషనర్ శ్రీరాములు సత్యనారాయణ తనిఖీలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు. కమిషనర్‌కు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శేష వస్త్రం బహూకరించి, అమ్మవారి చిత్రపటాన్ని ఈవో కె.సురేష్‌బాబు బహూకరించారు. ఆలయ రికార్డులను తనిఖీలు చేశారు. తనిఖీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

26 మంది వలంటీర్ల రాజీనామా

గుడివాడ రూరల్, ఏప్రిల్ 10: వలివర్తిపాడు గ్రామానికి చెందిన 26 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో జ్యోతి బుధవారం తెలిపారు. రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారని ఆమె పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం: వడ్డాది

గుడివాడ రూరల్, ఏప్రిల్ 10: మహిళల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్ ధ్యేయమని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, మహిళలను ఆర్థికంగా పైకి తీసుకురావటానికి 9 పథకాలు అమలు చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వడ్డాది గోవిందరావు తెలిపారు. బుధవారం బిళ్లపాడులో నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో ప్రతీ పేద కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు నేరుగా అకౌంట్‌లో పడతాయని వడ్డాది తెలిపారు. గ్రామీణ మహిళలకు ఐదు లక్షల 40 వేల రూపాయలు వస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి బిళ్లపాడు గ్రామవాసి దేవర కొండ కృష్ణ వచ్చి చేరారు. ఆయనతోపాటు 12 మంది పార్టీలోకి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణరావు, జిల్లా మహిళా కార్యదర్శి దగాని నిశ్చల షేక్ మీర్జా, మునగాల పార్వతి, కసిరెడ్డి పుష్ప, కొమ్ము పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేద విద్యార్థుల దత్తత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10: నోబుల్ బాయిస్ హాస్టల్‌లో నివసిస్తున్న నలుగురు పేద విద్యార్థులను మైత్రి ఫౌండేషన్ దత్తత తీసుకుంది. బుధవారం ఫౌండేషన్ అధ్యక్షుడు కె.వేణుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిలకలపూడికి చెందిన ఉపాధ్యాయురాలు కె.అనిత నలుగురు పేద విద్యార్థులను దత్తత తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, రామకృష్ణ, ప్రసాద్, తోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.